


4న జిల్లాకు పవన్‌కల్యాణ్

- వారాహియాత్రలో భాగంగా రాక
- నెల్లిమర్లలో ప్రసంగం



(విజయనగరం- ఆంధ్రజ్యోతి)


జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన వారాహి యాత్ర జిల్లాలోనూ జరుగనుంది. వచ్చేనెల 4న ఆయన జిల్లాకు రానున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా నెల్లిమర్ల అసెంబ్లీ స్థానం జనసేన పార్టీకి దక్కింది. లోకం నాగమాధవి పోటీ చేయనున్నారు. ఉమ్మడి అభ్యర్థి తరఫున ప్రచారం చేసేందుకు పవన్ వస్తున్నారు. ఆయన వస్తున్నట్లు తెలిసి కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల టీడీపీ నాయకత్వం పూర్తిస్థాయిలో సహాయ సహకారం అందించేలా లోకం నాగమాధవి ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. టీడీపీ, జనసేన నాయకులతో సమావేశమై అభిప్రాయ బేధాలు లేకుండా చూసుకుంటున్నారు. కేడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు పవన్ కల్యాణ్ పర్యటన దోహదపడుతుందని ఆ పార్టీ శ్రేణులు నమ్మకంగా ఉన్నాయి. వారాహి యాత్రకు సంబంధించి ఏర్పాట్లు ఏ విధంగా చేయాలన్నదానిపై నాయకులు ఇప్పటికే సమాలోచనలు ప్రారంభించారు. నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. విజయనగరంతో నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రం కలిసి ఉన్న కారణంగా విజయనగరం నుంచి కూడా చాలా మంది యువత, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉంది. వారాహి యాత్రను విజయవంతం చేసేందుకు అందరూ సంసిద్ధులవుతున్నారు. ఇదే విషయమై జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్విని మాట్లాడుతూ వారాహి యాత్రకు సంబంధించి ఏప్రిల్ 4న జిల్లాకు పవన్‌కల్యాణ్ వస్తున్నారని టైమ్ షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉందని వెల్లడించారు.

గెడ్డ అని తెలిసి..

ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ నాయకులు తమ రాజకీయ మనుగడకు భూ కబ్జాను వాడుకుంటున్నారు. ఖాళీ స్థలాలను ఆక్రమించుకున్న వారిని నిలువరించకుండా తోడ్పాటు అందిస్తున్నారు. మళ్లీ మన ప్రభుత్వం వస్తే పట్టాలు కూడా ఇస్తామని నమ్మబలుకుతున్నారు. విజయనగరంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో ఊటగెడ్డ పరివాహక ప్రాంతంలో జరుగుతున్న భూ వ్యవహారమిది. కొందరు వ్యక్తులు ఏకంగా కట్టడాలకు దిగారు. కొద్దినెలల కిందటే పునాదులు వేసేశారు. పట్టాలు లేకపోవడంతో అక్కడితో ఆగారు. నాయకులను సంప్రదించగా రాజకీయాలతో ముడిపెట్టారు. మళ్లీ గెలిస్తే పట్టాలు ఇచ్చేస్తామని, ఎన్నికల్లో సహకారం అందించాలని కోరుతున్నారు. ఈ ఆక్రమణలను రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

పునాది వేసి

- 50 వరకు కట్టడాలు నిర్మించేందుకు ప్రయత్నాలు
- మళ్లీ మనమొస్తే పట్టాలంటూ మభ్యపెడుతున్న నేతలు
- ఓ ప్రజాప్రతినిధి అండదండలు
- తేల్చని అధికారులు





పూల్‌బాగ్ ప్రాంతంలో ఊటగెడ్డ చెంత వెలసిన పునాదులు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

విజయనగరాన్ని ఆనుకుని ఉన్న చెరువులు ఇప్పటికే దురాక్రమణకు గురవుతున్నాయి. నాయక గణం వాటిపై పడి సొంతం చేసుకుంటున్నారు. వారి అడ్డదారి సంపాదనకు గెడ్డలూ మినహాయింపు కాదు. పూల్‌బాగ్ ప్రాంతంలోని ఊటగెడ్డపై ఇటీవల కొందరి కన్ను పడింది. పరివాహక ప్రాంత స్థలాన్ని ఆక్రమించి ఏకంగా 50 పునాదులు వేసేశారు. రెండో కంటికి తెలియకుండా కొద్దినెలల కిందట ఈ వ్యవహారం సాగింది. ఇందులో వైసీపీ నాయకులు, వారి అనుచరులు, వ్యాపార భాగస్వాములున్నట్లు సమాచారం. ఒక్కొక్కరికి 90 గజాలు చొప్పున పంపకాలు చేశారు. నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులకు స్థలాలు దక్కినట్లు సమాచారం. వీరంతా ఆఘమేఘాలమీద పునాదులు కూడా వేసేశారు. అయితే ఓ ప్రజాప్రతినిధి వ్యాపార భాగస్వామి ఆక్రమణదారులకు ఒక షరతు విధించాడట. లబ్ధిపొందిన వారంతా ఎన్నికల్లో వైసీపీ నాయకుడికి వెన్ను దన్నుగా నిలవాలని కోరాడట. మళ్లీ మనమే వస్తే పట్టాలు కూడా ఇస్తామన్నాడని తెలిసింది. కాగా గెడ్డ పొంగి ప్రవహిస్తే పునాదులు కొట్టుకు పోతాయని తెలిసినా ఆక్రమణలకు తెగించారు. ప్రజాప్రతినిధి అండదండలున్న కారణంగా రెవెన్యూ యంత్రాంగం కూడా చూసీచూడనట్లు పోతోంది. ఈ గెడ్డ పోరంబోకు ప్రాంతంలో పునాదులు వేయడంపై టీడీపీ నాయకులు స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ నాగలక్ష్మీ ఆ ఫిర్యాదును తహసీల్దారు కార్యాలయానికి పంపించారు. అప్పటి తహసీల్దారు కోరాడ శ్రీనివాసరావు పరిశీలనకు వీఆర్‌వోను పంపించారు. ఆ తర్వాత ప్రజా ప్రతినిధి రంగంలోకి దిగి రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో గెడ్డ పక్కనున్న ఆ స్థలం జిరాయితీ కిందకు వస్తుందని తహసీల్దారు లిఖిత పూర్వకంగా కాకుండా నోటిమాటగా ప్రకటించారు. పూర్తిస్థాయి రికార్డులు పరిశీలించి సంబంధిత స్థలం గెడ్డ పోరంబోకు కిందకు వస్తుందా లేదా అన్నది తేల్చాల్సి ఉంది. రికార్డు పరంగా కాకుండా నోటి మాటగా చెప్పి సమస్యను దులిపేసుకునేలా రెవెన్యూ యంత్రాంగం చూస్తోంది. ఒక వేళ జిరాయితీ భూమి అయినట్లయితే ఎవరి పేరున జిరాయితీగా ఉంది అన్నది తేల్చాలి. ఇప్పటికైనా ఫిర్యాదీదార్లను పిలిపించి వారి సమక్షంలో రికార్డు పరంగా ఆ భూమి సంగతి తేల్చాల్సి ఉంది. ఈ స్థలం అయ్యప్పనగర్ లోని సర్వే నెంబరు 136లో ఉంది. నిబంధనల ప్రకారం గెడ్డకు 30 మీటర్లు దూరం వరకూ ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదు. గెడ్డకు ఆనుకుని ఉన్న ఈ స్థలం గెడ్డ పోరంబోకు కిందకే వస్తుందని ప్రతిపక్ష టీడీపీ నాయకులు చెబుతున్నారు.

ఓటరు జాబితాలో పేరుందా?

- వెంటనే పరిశీలించుకోండి
- 15 వరకూ కొత్త ఓటు నమోదుకు అవకాశం

కలెక్టరేట్, మార్చి 28: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరుందా? లేదా చెక్ చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరుపై ఉంది. ఈ ఏడాది జనవరి 22వ తేదీన విడుదల చేసిన జాబితాకు ఇటీవల నమోదు చేసుకున్న ఓటర్ల పేర్లను కూడా చేర్చారు. అర్హులైన వారు ఉండి జాబితాలో పేరు లేకపోతే వచ్చే నెల 15వ తేదీలోగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ గడువు ఇచ్చింది. అడ్రస్ మార్పునకు అవకాశం లేదు. ఒక వేళ పేరులో తప్పుంటే సరి చేసుకోవచ్చు. ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన జాబితా ప్రకారం 15,41,001 ఓటర్లు ఉన్నారు. తుది జాబితాలో ఓటు ఉందా? లేదా అనేది ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు. ఓటరుగా నమోదైనప్పటికీ పోలింగ్ రోజున జాబితాలో పేర్లు లేకపోవడంతో ఎప్పుడూ చూస్తూనే ఉన్నాం. అటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే ముందుగా ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలి. జాబితాలో పేరు లేకపోతే వెంటనే ఫారం 6 ద్వారా కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి. 18 సంవత్సరాలు నిండిన వారంతా బీఎల్‌వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే వెబ్‌సైట్‌లో కూడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.



అంతిమ కష్టాలు

- నడుంలోతున చెరువులో దిగి మృతదేహం తరలింపు

గజపతినగరం, మార్చి 28: పాపం పురిటిపెంట కాలనీ వాసులకు అంత్యక్రియలకూ అవస్థలు తప్పడం లేదు. మృతదేహాన్ని శ్మశానికి తరలించాలంటే నడుంలోతున చెరువులో దిగి వెళ్లాల్సిందే. రైల్వే మూడోలైను పనుల్లో భాగంగా స్థానిక రైల్వే క్యాబిన్ సమీపంలో ఉన్న కల్వర్టును మూసివేయడంతోనే వారికీ అవస్థ. ఎగువన ఉన్న రాళ్ల చెరువు నీరు విపరీతంగా నిలిచిపోవడంతో శ్మశానం కూడా మునిగిపోయింది. పురిటిపెంట గ్రామానికి చెందిన శనపతి అప్పలనాయుడు వయస్సు రీత్యా మృతి చెందారు. మృతదేహాన్ని శ్మశానానికి తీసుకువెళ్లేందుకు గురువారం కాలనీవాసులు అష్టకష్టాలు పడ్డారు. నడుంలోతున నీటిలో తరలించాల్సి వచ్చిందని వాపోయారు. గతంలో రైల్వేలైనుకు ఆనుకొని ఉన్న స్థలాన్ని శ్మశానంగా వాడేవారు. గ్రామానికి చెందిన దాత 3సెంట్లు స్థలం దానం చేయడంతో అప్పటి నుంచి ఇక్కడే అంత్యక్రియలు చేస్తున్నారు. కల్వర్టు మూసివేయడంతో ఇప్పుడు నరకయాతన పడుతున్నారు. శ్మశానం వద్ద నీరు నిలిచిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

కొట్టక్కి వద్ద ఘోర ప్రమాదం

- బైకులు ఢీకొని ముగ్గురి మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

రామభద్రపురం, మార్చి 28: రామభద్రపురం మండలంలోని కొట్టక్కి వద్ద ఒట్టిగెడ్డ వంతెనపై గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రామభద్రపురం మండలం జన్నివలస గ్రామానికి చెందిన జొన్నాడ పురుషోత్తం (25) గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో సాలూరు నుంచి టూ వీలర్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈయనతో పాటు జి.రాంప్రసాద్, జి.గణేష్ ఉన్నారు. సాలూరు గొల్లవీధికి చెందిన జి.శ్రీను (45), యశోద కృష్ణ (22) రామభద్రపురం వైపు నుంచి టూ వీలర్‌పై సాలూరు వెళ్తున్నారు. జాతీయ రహదారిపై ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు బైకులూ కొట్టక్కి వంతెన వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి ఢీకొన్నాయి. పురుషోత్తం తలకు తీవ్రమైన గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. శ్రీను, కృష్ణలు సాలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. జన్నివలసకు చెందిన గణేష్, రాంప్రసాద్‌లు తీవ్ర గాయాలతో విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ తిరుమలరావు పరిశీలించారు. పురుషోత్తం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బాడంగి సీహెచ్‌సికి తరలించారు. జి.శ్రీను, యశోదకృష్ణల మృతదేహాలను సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు ఆస్పత్రుల వద్ద బంధువుల రోదనలతో తీవ్ర విషాదం నెలకొంది.

పానీపురి ఇచ్చి బయటకు వెళ్లిన కృష్ణ

సాలూరు పట్టణంలోని గొల్లవీధికి చెందిన యశోదకృష్ణ అప్పటి వరకు ఇంటి వద్దే ఉన్నాడు. ఇంట్లో వారికి పానీపురి ఇచ్చి కాసేపట్లో వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. కొద్ది క్షణాల్లోనే కృష్ణకు ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులకు తెలిసింది. ఆందోళనతో ఆస్పత్రికి పరుగులు తీయగా అప్పటికే మృతిచెందాడు. చికెన్‌షాపులో పనిచేస్తు ఇంటికి చేదోడువాదోడుగా ఉన్న కొడుకు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడటంతో తల్లిదండ్రులు తీవ్రంగా విలపిస్తున్నారు.

ఆ పిల్లలకు దిక్కెవరు

సాలూరు పట్టణంలో గొల్లవీధికి చెందిన గొట్టేడ శ్రీనుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇళ్లకు రంగులు వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందడటంతో ఆ పిల్లలకు దిక్కు ఎవరని బంధువులు బోరున విలపిస్తున్నారు.



పురుషోత్తం(ఫైల్)

సీడ్ కంపెనీలో పనిచేస్తున్న పురుషోత్తం

జొన్నాడ పురుషోత్తంకు పెళ్లి కాలేదు. మొక్కజొన్న సీడ్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా డు. ఒక్కగానొక్క కొడుకు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు అప్పలస్వామి, తవుడమ్మను ఓదార్చడం ఎవరి తరం కాలేదు.



యశోద కృష్ణ(ఫైల్)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు గణేష్

సాగునీటికి గండం

- కాల్వలకు మరమ్మతులు చేపట్టని అధికారులు
- కళతప్పిన సారథిగెడ్డ, రుద్రసాగరం
- దాదాపు 40వేల ఎకరాలకు అందని నీరు
- భవిష్యత్‌పై రైతుల్లో గుబులు



పొదలతో కప్పబడిపోతున్న తోటపల్లి పిల్ల కాలువ



రాజాం రూరల్, మార్చి 28: రాజాం ప్రాంతంలో ఏటా వేల ఎకరాలను సస్యశ్యామలం చేస్తూ అన్నదాతలకు అండగా నిలిచిన సాగునీటి కాల్వలు నేడు కళతప్పాయి. స్వరూపాన్ని కోల్పోయి పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఏళ్లుగా మరమ్మతుల్లేక శివారు భూములకు వాటా ద్వారా నీరందక దయనీయంగా కనిపిస్తున్నాయి. సాగునీటి కాల్వలను శుభ్రం చేసి మరమ్మతులు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోతోంది. ప్రభుత్వం సైతం సాగునీటి వ్యవస్థపై శీతకన్ను వేయడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రధానంగా సారథిగెడ్డ, రుద్రసాగరంలకు మరమ్మతులు చేపడితే విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని 50 నుంచి 60 గ్రామాల్లో సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరందించే వీలున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

తోటపల్లి పిల్ల కాల్వలదీ...

తోటపల్లి ప్రధాన కాల్వ నుంచి నియోజకవర్గంలోని వందలాది ఎకరాలకు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పిల్లకాల్వలు సైతం మరమ్మతులకు నోచుకోవడంలేదు. నాలుగు మండాలలోనూ ఇదే దుస్థితి. ఫలితంగా శివారు భూములకు సకాలంలో సాగునీరందక రైతాంగం నానా అవస్థలకు గురవుతున్నారు. భవిష్యత్తులో సాగు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం లేకపోలేదని రైతులు పేర్కొంటున్నారు.

30 గ్రామాల పొలాలకు రుద్రసాగరం నీరు

రుద్రసాగరం సైతం మరమ్మతులకు నోచుకోలేదు. తెర్లాం ప్రాంతం నుంచి మిగులు జలాలు రాజాం, రేగిడి మండలాల పరిధిలో సుమారు 30 గ్రామాల రైతాంగానికి సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరందించే రుద్రసాగరం కాలువ అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని కొత్తపేట, ఒమ్మి, ఆగూరు, అమరాం తదితర గ్రామాల మీదుగా రేగిడి మండలం కాగితాపల్లి, బాలకవివలస, కొర్లవలస, పనసలవలస, తదితర గ్రామాల రైతాంగానికి రుద్రసాగరం ద్వారా సాగునీరందేది. దీనిపైనా నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. కాల్వల్లో పిచ్చిమొక్కలు వెక్కిరిస్తున్నాయి.

వేల ఎకరాలకు నీరిచ్చే సారథి గెడ్డ

రెండు జిల్లాల్లోని 30 గ్రామాల పరిధిలో సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరందించే సారథిగెడ్డ పూర్తిగా పిచ్చిమొక్కలు, ఇతరత్రా వ్యర్థాలతో నిండిపోయింది. వాన నీటి మిగులు జలాలు చెరువులు, వాగులు, వంకల ద్వారా ప్రవహిస్తూ సారథిగెడ్డలో కలిసేలా బొబ్బిలి రాజులు అప్పట్లో సాగునీటి వ్యవస్థను రూపొందించారు. ఈ గెడ్డ ద్వారా రాజాం మండలంలోని బి.ఎన్.వలస, జిసి.పల్లి, మారేడుబాక, కొత్తవలస, సారధి, అంతకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలం నాగులవలస, పెంట, కొత్తపెంట గ్రామాల చెరువులను నింపుతూ సంతకవిటి మండలం మండాకురిటి, సిరిపురం తదితర గ్రామాలలోని పొలాలకు సాగునీరందించేది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన సారథిగెడ్డ కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు.

పట్టించుకోని ప్రభుత్వం

సాగునీటి వనరుల అభివృద్ధి, మరమ్మతులపై ప్రభుత్వం శీతకన్ను వేసింది. పదేళ్ల అధికారం వెలగబెట్టిన ఎమ్మెల్యే జోగులు రైతుల వెతలపై దృష్టి సారించలేదు. సాగు సమస్యల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే చొరవ చూపలేదు.



నాచు, పూడికతో అరకొర నీరే ఉన్న సారథిగెడ్డ

ఉచిత కంటి వైద్య శిబిరం

విజయనగరం రూరల్: జొన్నవలస గ్రామంలో గురువారం డాక్టరు చిట్టి రమణరావు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఆసుపత్రి వారు సొంత నిధులతో చేయించారు. రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

రేగిడి: మండల భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు గురువారం ఫిజియోథెరపీ వైద్యులు ఎం రమాచంద్రిక నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు తల్లిదండ్రులు ఇంటివద్ద ఎటువంటి వ్యాయామాలు చేయాలో వివరించారు. దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేయించడంవలన వారి వచ్చే మార్పులను వివరించారు. ఎంఈవో ప్రసాద్‌రావు, ఎంఈవో-2 ఎరకయ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం రూరల్: టీడీపీ అవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు నాయకులు ఐవీపీ రాజు, పిల్లా విజయ్‌కుమార్ చెప్పారు. గురువారం ఉదయం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆనాడు ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. టీడీపీ నాయకులు, విజ్జపు ప్రసాద్, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, గంటా పోలినాయుడు, కంది సాయి జగ్గారావు, ముద్దాడ చంద్రశేఖర్, నడిపల్లి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలంటే అంత చులకనా?

బాడంగి: ఇటీవల ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు గిరిజన మహిళ చీర, జాకెట్టు, కట్టుబొట్టుల గురించి అవహేళనగా మాట్లాడడం హేయమైన చర్యని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ, గజరాయనివలస ఎంపీటీసీ సభ్యులు పాలవలస గౌరు అన్నారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా మాట్లాడడం అన్యాయమని తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఇలా ఎస్టీలను అవహేళన చేసినట్టు ఏ ఒక్క వైసీపీ లీడర్ మాట్లాడినా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

జమ్ము నారాయణపురంలో జయహో బీసీ

విజయనగరం రూరల్: విజయనగరం మండల పరిధిలోని జమ్మునారాయణపురంలో జయహో బీసీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు మాట్లాడుతూ బీసీల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం నాయకులు కంది మురళీనాయుడు, కోండ్రు శ్రీనివాసరావు, గంటా పోలినాయుడు, కంది సాయిజగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భగవద్గీతపై ప్రవచనాలు

విజయనగరం రింగురోడ్డు: కొత్తపేటలోని మన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకూ భగవద్గీతలోని రెండో అధ్యాయం సంఖ్యా యోగంపై ప్రవచనాలు ఏర్పాటు చేస్తున్నట్టు నిష్కామ ఫౌండేషన్ ఆధ్యాత్మిక ప్రవచకులు అరుణ తెలిపారు. గురువారం మన్నార్ రాజగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకూ ప్రవచనాలు ఉంటాయన్నారు. యువత భగవద్గీత గురించి తెలుసుకోవాలన్నారు. ఈ గ్రంథం ఒక కాలానికో, మతానికో, వయస్సుకో సంబంధించినది కాదన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఫౌండేషన్ ప్రతినిధులు నరసింహారావు, కాపుగంటి వరహాలు, సూర్యకాంతం, జి.వీ రఘురావు తదితరులు పాల్గొన్నారు.

'రౌతు'కు పతంజలి పురస్కారం

విజయనగరం దాసన్నపేట: ప్రముఖ రచయిత, సంపాదకులు, హోమియో వైద్యులు కేఎస్‌వై పతంజలి 72వ జయంతి సందర్భంగా ఏటా అందజేసే రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈ ఏడాది పార్వతీపురానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా కంటెంట్ హెడ్ రౌతు బంగారు నాయుడిని ఎంపిక చేసినట్టు కేఎస్‌వై పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి బాబ్జీ, ఎంకే బాబు తెలిపారు. గురువారం ఆర్ అండ్ బీ సమీపంలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ మే 17న ఈ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు ప్రభాకరరావు, రామచంద్ర రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ హుండీ లెక్కింపు

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ చదురు, వనం గుడుల హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వీధిలోని పైడిమాంబ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. చదురుగుడికి సంబంధించి రూ.10 లక్షల 94 వేల 587 నగదు, బంగారం 24 గ్రాముల 400 మిల్లీగ్రాములు, వెండి 92 మిల్లీగ్రాములు వచ్చింది. వనంగుడికి రూ.8 లక్షల 38 వేల 713 నగదు, 5 గ్రాముల 400 మిల్లీగ్రాములు బంగారం, 315 గ్రాముల వెండి వచ్చింది.

దాదీ జానకి స్థితప్రజ్ఞురాలు


బొబ్బిలి: బ్రహ్మకుమారి రాజయోగిని దాదీ జానకి స్థిత ప్రజ్ఞురాలు అని మున్సిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాదీ జానకి 4 వ పుణ్యస్మృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు పాల్గొని నివాళులు అర్పించారు. బ్రహ్మకుమారీస్ శాఖలను 135 దేశాలకు విస్తరింపజేయడంలో దాదీ కృషి అమోఘమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జగన్నాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

తెర్లాం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు మండల పరిధిలో గురువారంలో విజయ రాంపురం, అప్పలంపేట, గోలుగువలసలో స్థానిక ఎస్ ఐ రమేష్ అధ్యక్షతన గ్రామల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి

శృంగవరపుకోట: గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు డి.సూర్యారావు కోరారు. గురువారం శృంగవరపుకోటలో విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 14 నుంచి ఈ సభలు జరగనున్నాయన్నారు. ఆయన వెంట ఎల్.సాంబమూర్తి, సీహెచ్ రామకృష్ణ, ఆర్.సూరి దేముడు, అప్పారావు, జి.ధనంజయ తదితరులు వున్నారు.



మాట్లాడుతున్న సూర్యారావు

ఎక్కడి పనులు అక్కడే..

- ఇదీ వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి తీరు
- బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిన నిర్మాణాలు
- టీడీపీ మంజూరు చేసిన పథకంపై నిర్లక్ష్యపు నీడలు

శృంగవరపుకోట రూరల్

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి ఒకడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది. ప్రభుత్వ భవనాలు, రహదారులు ఇలా అనేకం హామీలకే పరిమితం కాగా అక్కడక్కడా నిర్మాణాలు మొదలైనా పూర్తి కావడం కష్టమైంది. పెదఖండేపల్లి పంచాయతీలో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రం పనులు ఐదేళ్ల క్రితం ప్రారంభించారు. చాలా రోజులు కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో చేతులెత్తేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో వీరికి బిల్లులు మంజూరు చేసినా ఇవి పూర్తి కాని పరిస్థితి. అసంపూర్తి భవ నాలు పేకాటరాయుళ్లు, మందు బాబులకు అడ్డాగా మారాయి. గత ఏడాది జూన్ తరువాత ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఎస్.కోట నుంచి పెద ఖండేపల్లికి బీటీ రోడ్డు మంజూరు చేశారు. ఇదిగో రూ.రెండు కోట్లు విడుదల చేస్తున్న జీవో అంటూ ఒకవైపు ఎమ్మెల్యే వర్గం.. మరో వైపు ఎమ్మెల్సీ వర్గం ప్రచార హోరుతో ఊదరగొట్టారు. జీవోలు వచ్చినా.. నిధులు రాకపోవడంతో పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. ఇక మండలంలోని కొట్టాం పంచాయతీ బందారువాని పాలెంకు అదే ఉప ముఖ్యమంత్రి ఎన్‌ఆర్‌జీఎస్ కింద నిధులు మంజురు చేశారు. ఆ గ్రామానికి తారురోడ్డు వేసేస్తాం అంటూ ప్రచారం చేశారు. కానీ అక్కడా అంతే.. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇంకా అనేక పనులు బిల్లులు రాక ఎక్కడివి అక్కడే ఉన్నాయి.

టీడీపీ పథకమని...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019కు ముందు ధర్మవరంలో సాయిరాం ఎత్తిపోతల పథకం ఉండేది. అయితే ఇది పూర్తిగా పనికి రాకుండా మారడంతో నాటి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి.. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి రూ.రెండు కోట్లు ఇస్తే 500 ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. దీంతో వేములాపల్లి గోస్తనీ నది తీరాన్ని ఆనుకొని కొత్త పథకం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడంతో చకచకా పనులు కదిలాయి. ఈలోపు ఎన్నికలు రావడంతో బ్రేకులు పడ్డాయి. వైసీపీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమది రైతుల ప్రభుత్వం అని ఉదరగొట్టింది తప్ప రూ.రెండు కోట్లతో తలపెట్టిన సాయిరాం ఎత్తిపోతల పథకం ప్రారంభించేందుకు కనీసం ప్రయత్నం చేయకపోవడం దారుణం. వారి హయాంలో నిర్మించిన పథకం మనం ప్రారంభించడం ఎందుకనే ధోరణిలో దీని విషయం గాలికి వదిలేశారు. దీంతో పొలాలు బీడువారిపోయాయని రైతులు వాపో వడం తప్ప ఇంకేం చేయలేక పోయారు. దీనిపై ప్రశ్నిస్తే తమపై ఎక్కడ కక్ష సాధింపు లు ఉంటాయోనని నోరు మెదపకుండా... ప్రారంభం కాని ఎత్తిపోతల పథకం వైపు చూ డటం తప్ప ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోయారు. ఈ పథకం ప్రారంభానికి ముందే ఏళ్ల తరబడి నిర్వహణ లేక మరమ్మతులకు గురైంది. సంబంధిత శాఖ దీనిని పట్టించుకోకపోవడం గమనార్హం. మరి దీనికి మంచి రోజులు ఎప్పుడు వస్తాయో చూడాలి.



గత ఏడాది బీటీరోడ్డు వేస్తామని చెప్పిన ఎస్.కోట-పెదఖండేపల్లి రహదారి



గత ప్రభుత్వంలో నిర్మించిన సాయిరాం ఎత్తిపోతల పథకంను నేటికి ప్రారంభించకుండా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం

టీడీపీలోకి పలువురి చేరిక

● ఆహ్వానించిన విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

శృంగవరపుకోట: శృంగవరపుకోట యడ్లవీధి, పుణ్యగిరికి చెందిన పలువురిని విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం ఉదయం పార్టీ నూతన కార్యాలయం ప్రారంభ సమయంలో యడ్లవీధికు చెందిన సుమారు 100 కుటుంబాలు పార్టీ కండువా కప్పుకున్నాయి. నాయకులు డి.దినేష్, పి.వెంకటరావు, సంతోషి, కె.వెంకటరావుతో సహ సన్యాసమ్మ, గౌతమి, హరిత, కృష్ణమ్మ, ఈశ్వరమ్మ తదితర కుటుంబాలకు చెందిన సభ్యులు కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో చేరేందుకు వచ్చారు. పుణ్యగిరిలో ఎన్నికల ప్రచారం నిమిత్తం ఇంటింటికి తిరిగేటప్పుడు స్థానిక ఎంపిటీసీ దారగిరితో సహ 25 కుటుంబాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీభరత్ చేతులమీదగా పార్టీ కండువా కప్పుకున్నారు.



ఎస్.కోట పుణ్యగిరిలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన కార్యకర్తలతో శ్రీభరత్

ఎస్.కోటలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

శృంగవరపుకోట: కోళ్ల లలిత కుమారి కుటుంబంతో మాకు దశాబ్దాల అనుబంధం ఉందని విశాఖ పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. గురువారం శృంగవరపుకోట పట్టణంలో నియోజకవర్గస్థాయి పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బాగుంటేనే మనమందరం బాగుంటామని, పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పలరామ ప్రసాద్, ఎంపీపీ సోమేశ్వరరావు, వైఎస్ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ సంతోషి కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, నాయకులు కొణదం మల్లేశ్వరరావు, రెడ్డి వెంకన్న, కాపుగంటి వాసు, చెక్క కిరణ్, కరెండ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, కోళ్ల శ్రీను, లాలం అర్జునరావు, కొట్యాడ రమణ మూర్తి, దాసరి లక్ష్మి తదితరులున్నారు.

రేపు రామనారాయణం దశమ వార్షికోత్సవం

విజయనగరం రింగురోడ్డు: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామ నారాయణంలో ఈ నెల 30న దశమ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించ నున్నట్టు ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్ వెల్లడించారు. గురు వారం రామనారాయణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ 30న ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, ఆ తరువాత ప్రాతఃకాల అర్చన, సర్వదేవతా మూర్తుల అష్టకలశ స్నపన, విశేష అర్చనలు ఉంటాయ న్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్ణాహుతి, సాయంత్రం ఐదు గంటలకు సీతా కోదండ రామ స్వామికి శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి ఏకకాలంలో వైఖానస ఆగమానుసారంగా కళ్యాణోత్సవం నిర్వహిస్తామని తెలి పారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లయ అర్చకులు చాణక్య రమణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రాష్ట్రాన్ని ముక్కలు చేసిన జగన్

బొబ్బిలి: రాష్ట్రాన్ని ముక్కలుగా చేసి పరిపాలన సాగించిన జగన్ అభివృద్ధి మాట పూర్తిగా మరిచి పోయారని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక ఓ హోటల్‌లో గురువారం సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అచ్చెన్నాయుడు అధ్యక్షతన అభ్యర్థులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 35 లక్షల ఎకరాల సాగుభూములున్నప్పటికీ అందులో రెండు లక్షల ఎకరాలకు నీరివ్వలేని అసమర్థప్రభుత్వమన్నారు. 16 ప్రాజెక్టులు ఉన్నప్పటికీ రైతులకు మేలు చేయడం లేదన్నారు. సొంత బాబాయ్ వివేకానంద హత్య కేసు మిస్టరీని తేల్చకుండా నిందితులను కాపాడుతున్నారని ఆరోపించారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, ఆ పార్టీతో దేశానికి ఎంతో నష్టమన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డి కిరణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ మహిళా అధ్యక్షురాలు, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి జాలాది విజయ, ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి కిరణ్‌కుమార్, అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపకుడు సోరు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున వెంకటేశ్వరరావు

కార్మికులకు రూ.1.63 కోట్ల పీఎఫ్ బకాయిలు

బొబ్బిలి: శ్రీలక్ష్మీ శ్రీనివాసా జూట్‌మిల్లులో 1200 మంది కార్మికులకు 1.63 కోట్ల రూపాయల పీఎఫ్ బకాయిలను యాజమాన్యం చెల్లించకపోయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తామని వాగ్దానాలు కురిపించి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి మూసివేతకు దారులు వేశారని ఆరోపించారు. 312 మంది కార్మికులకు 55 ఏళ్ల నిండిపోయాయని, వారంతా పెన్షన్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు కార్మికుల బకాయిలన్నిటినీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం చేస్తామని తెలిపారు. ఎస్.గోపాలం, యుగంధర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు సీఎం కావాలి

విజయనగరం రూరల్: రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు సీఎం కావాలని, అందుకు ప్రజలంతా సహకరించాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి, నదుల అనుసంధానం, పారిశ్రామిక అభివృద్ధి కోసం దేశంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో జగన్ పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, గంటా పోలినాయుడు, ఆల్తి బంగారుబాబు, పిల్లా విజయ్‌కుమార్, కంది మురళీనాయుడు, ముద్దాడ చంద్ర శేఖర్, నడిపిల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

ఓటరు జాబితా పరిశీలన వేగవంతం

విజయనగరం నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో బూత్‌లవారీగా ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదితి గజపతిరాజు ఒక ప్రకటనలో కోరారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వద్దకు వెళ్లి పరిశీలిస్తే ఫలితం ఉంటుందన్నారు. నగర పరిధిలోని 37వ డివిజన్ బీసీ కాలనీ రామాలయం ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ బూత్ స్థాయి కన్వీనర్లు, డివిజన్ కమిటీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నగర కార్యదర్శి ఏప రాజు, బూత్ కన్వీనరు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

రామభద్రపురం, మార్చి 28: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. మండల పరిధిలోని మిత్తివలస, జన్నివలస గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామంలో ఎటువంటి రాజకీయ విబేధాలు లేకుండా ఐకమత్యంతో ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. సీఐ తిరుమలరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

వినూత్నంగా బేబీనాయన ప్రచారం

బొబ్బిలి, మార్చి 28: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) బొబ్బిలి పట్టణంలో ఇంటింటి ప్రచారాన్ని వినూత్నంగా నిర్వహించి అందరినీ ఆకట్టుకుంటున్నారు. గురువారం 28వ వార్డులో నిర్వహించిన ప్రచారంలో భాగంగా ఆయన పశువుల పేడ(గెత్తా న్ని)ను ట్రాక్టరుకు ఎత్తుకుంటున్న ఓ రైతు దగ్గర నుంచి పార తీసుకొని తానే స్వయంగా తట్టతో గెత్తాన్ని ఎత్తి అందించారు. పుట్టుకతో శ్రీమంతుడైన జమిందార్ బిడ్డ ఇలా తమ జీవనస్థితి గతులను గమనిస్తూ భరోసా కల్పిస్తుండడం తమకు ఎంతో ఆనందంగా ఉందని ఓటర్లు వ్యాఖ్యానిస్తున్నారు. బేబీనాయన తన ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీమంత్రి, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పెద్దింటి జగన్మోహనరావును కలిసి ఆయన మద్దతును కోరారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జనసేన పార్టీ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, రాంబార్కి శరత్‌బాబు, పువ్వల శ్రీనివాసరావు, రౌతు రామ్మూర్తి, గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పేడ గెత్తాన్ని స్వయంగా ఎత్తుతున్న బేబీనాయన

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠలో..

తెర్లాం: మండలంలో అర్.గదబవలసలో నూతనంగా నిర్మించిన సీతారాముల అలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీతారాముల విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వీటికి కోడ్ వర్తించదా?

బొబ్బిలి: పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో గల శిలాఫలకాలను అధికారులు చాలా చోట్ల మూయించారు. స్థానిక పోలీసుస్టేషన్- తహసీల్దారు కార్యాలయాలకు ముందు ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకొని ఉన్న శిలాఫలకాలను ఏ కారణంచేతనో అలాగే వదిలేశారు. వాటిపై అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మున్సిపల్ కౌన్సిలర్లు పేర్లన్నీ ఉన్నాయి. నడిరోడ్డుపై ఉన్న ఆ శిలాఫలకానికి కోడ్ వర్తించదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కళాశాలల్లో విద్యార్థుల అటెండెన్స్ యాప్‌లలో సైతం సీఎం జగన్ ఫొటో యథాతథంగా కనిపిస్తోంది. ఈ ఫొటోను తొలగించకపోవడం పట్ల విమర్శలు ఎదురవుతున్నాయి.



మూతపడని శిలాఫలకాలు, యాప్‌లో జగన్ ఫొటో

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో గల పలు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి గురువారం అధికారులతో కలిసి పరిశీ లించారు. పాత బొబ్బిలి శ్రీవెంకటేశ్వర మున్సిపల్ పాఠశాల, తారకరామాకాలనీ డిపెప్, మల్లమ్మపేట డిపెప్, గెస్ట్‌హౌస్‌కాలనీలో గల పాఠశాలలను ఆమె పరిశీ లించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి వరప్రసాద్, ఏఈలు రవి, సురేష్, బీఎల్‌ఓ వోలతో మాట్లాడి పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. లైటింగ్, తాగునీరు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, మైదానం చదునుగా ఉంచ డం వంటివాటిని పూర్తి చేయాలని ఆదేశించారు.

బొబ్బిలిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి



ఓ అమ్మ బతుకు పోరాటం

అమ్మను మించిన దైవం లేదని ఓ సినీ రచయిత చెప్పినట్టు అమ్మ ఎప్పుడూ అండగా ఉంటుంది.. కష్టమైనా.. నష్టమైనా తానే భరించాలని చూస్తుంది.. బిడ్డకు ఏమాత్రం కష్టం కలగనీయదు. విజయనగరంలోని మయూరి జంక్షన్‌లో గురువారం కెమెరా కంట పడిన ఆ తల్లి ఓ దివ్యాంగురాలు. తను బతకడానికే చాలా కష్టపడాల్సిన పరిస్థితి. అయినా బిడ్డ తనకన్నా ఓ మెట్టు పైనే ఉండాలని తపించింది. తాను ఒంగి భిక్షాటన చేస్తూ బిడ్డను పైన కూర్చోబెట్టుకుంది. ఎండలోనూ అలుపెరుగకుండా ఆమె చేస్తున్న బతుకు పోరాటాన్ని చూసిన వారంతా ఆశ్చర్యపోయారు. కొందరు తోచిన సాయం చేశారు.

- విజయనగరం (ఆంధ్రజ్యోతి)



విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మక్కువ: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన కన్నంపేట గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు కన్నంపేటకు చెందిన చీపురు ఉమామహేష్(40) బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో వివాహ మండపంలో విద్యుత్ పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ వైరు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు స్పందించి బొబ్బిలి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లలిత ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు.



ఉమామహేష్ (ఫైల్)

గంజాయి స్వాధీనం

భామిని: బత్తిలిలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ప్రైవేటు బస్సులో ఒడిశా నుంచి ఆంధ్రాకు 12 కేజీల గంజాయిని తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులను గురువారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ సి.హెచ్.ప్రసాద్ తెలిపారు. దీని విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

కొమరాడ: రాష్ట్ర సరిహద్దులో ఉన్న కూనేరు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రాయగడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న బస్సులో ఒక వ్యక్తి వద్ద ఐదు కిలోల 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. గంజాయి తరలిస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన దీపక్‌రాయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు గురువారం తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

రాజాం: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రాత్రి వేలల్లో తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను రాజాం ఎస్ఈబి ఇన్‌సపెక్టర్ బి శ్రీధర్ ఎస్ఐ ఎం శ్రీనివాసరెడ్డి సిబ్బంది బుధవారం రాత్రి దాడి చేసి రెండు ఇసుక ట్రాక్టర్లును పట్టుకొని సీజ్ చేయడం జరిగిందని సిఐ బి శ్రీధర్ తెలిపారు. నాగావళి నది నుంచి రాత్రి సమయంలో తరలిస్తున్న విషయం తెలిసుకొని మాటువేసి రెండు ట్రాక్టర్లును 9 ఇసుక టన్నులను స్వాధీన పర్చుకొని రాజాం. రేగిడి పోలిస్ స్టేషన్లుకు అప్పగించడం జరిగిందన్నారు.

బాడంగి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. వేగావతి నది ఒడ్డున అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

భోగాపురంలో ఆటో చోరీ

భోగాపురం: భోగాపురం గ్రామంలో ఓ ఆటో చోరీకి గురయ్యింది. దీనిపై ఎస్ఐ డి.తాతారావు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డెంకాడ మండలం చుక్కపేట గ్రామానికి చెందిన చుక్క సత్యనారాయణ అనే వ్యక్తి ఈనెల 27న తన ఏపీ 31టీహెచ్ 0134 నెంబరుగల ఆటోలో భోగాపురం గ్రామదేవత పండగకు వచ్చాడు. సుమారు రాత్రి 7గంటల సమయంలో బజారు సమీప హైవే బ్రిడ్జి కింద ఆటోను పార్కింగ్ చేసి, జాతరకు వెళ్లాడు. తిరిగి అదేరోజు రాత్రి 11గంటలకు వచ్చి చూడగా, అక్కడ ఆటో లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సీతంపేట: పెద్దబగ్గ గ్రామ సమీపంలో 20 లీటర్ల సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు గురువారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పెద్దబగ్గ గ్రామంలో దాడి చేయగా, ఊయక నరసింహ తన ఇంటి పెరట్లో 40 లీటర్ల సారాతో పట్టుబడ్డాడు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించామని ఎస్ఐ చెప్పారు.

పూరిల్లు దగ్ధం

కొమరాడ: చినఖేర్జిల గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతైంది. వివిధ ధ్రువపత్రాలు, రూ.45 వేల నగదు కాలి బూడిదైనట్లు బాధితుడు రవికుమార్ తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పాటు గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాదం తీవ్రంగా జరిగిందని తెలిపారు. విషయం తెలుసుకున్న కొమరాడ ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్‌వో రాఘవ సంఘటన స్థలాన్ని పరిశీలించి...నష్టాన్ని అంచనా వేశారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

విజయనగరం క్రైం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, ఎత్తుబ్రిడ్జి లాడ్జీల్లో గురువారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జీల్లో అనుమానిత వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తారకేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.



లాడ్జిల్లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ

● **బాడంగి:** హెచ్.పాల్తేరు గ్రామస్థులకు ఎస్ఐ ఆర్.జ యంతి ఎన్నికలపై గురువారం అవగాహన కల్పించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకా కూడదని అన్నారు. గ్రామాల్లో వివాదాలు సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉల్లంఘనలపై చర్యలు

● కొండ మామిడివలస అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలకు మెమోలు



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ శాంతికుమారి

మెంటాడ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఐసీడీఎస్ పీడీ బి.శాంతి కుమారి స్పందించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'కోడ్ ఉల్లంఘన కథనంపై స్పందించిన పీడీ.. కొండ మామిడివలస అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కోడిగుడ్లపై ముద్రించి ఉన్న జగనన్న గోరుముద్ద పేరుపై రంగు పూయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సూపర్ వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలకు మెమోలు జారీచేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా అధికారులు గజంగుడ్డి వలస, రెడ్డివానివలస, కొండలింగాలవలస గ్రామాల్లో పర్యటించి ఇళ్లకు ఉన్న జగన్ స్టిక్కర్లు, జెండాలు తొలగించారు. కోడ్ అమలు తీరును పరిశీలించారు.

చంద్రబాబుతోనే ప్రాజెక్టులకు మహర్దశ



ప్రచారం నిర్వహిస్తున్న కోండ్రు

రాజాం: రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ వస్తుందని కూటమి నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం బుచ్చింపేట గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, కిమిడి అశోక్ కుమార్, గురవాన నారాయణరావు, పొట్నా చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్లకే పింఛన్

రేగిడి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తుందని కోండ్రు మురళి అన్నారు. గురువారం రాత్రి మండలం కోడిస గ్రామంలో నిర్వహించిన 'జయహో బీసీ' కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేస్తామన్న డిక్లరేషన్ హామీతో రాష్ట్రంలో ఉన్న బీసీలందరూ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని కోండ్రు అన్నారు. సీఎం జగన్‌రెడ్డి బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా 56 కార్పొరేషన్లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు, గురవాన రమేష్, గురవాన నారాయణరావు, మజ్జి శ్రీను, దుప్పలపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి పతివాడ

డెంకాడ: మండల కేంద్రంలోని శ్రీబంగారమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, మాజీ జడ్పీ టీసీ పతివాడ అప్పలనారాయణ, రొంగలి కనకసింహాచలం తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు ఐదువేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు.

రక్తదానానికి ముందుకు రండి

రాజాం: రక్తదానానికి యువత ముందుకు రావాలని జీఎంఆర్‌వీఎఫ్ సీఈవో ఎల్‌ఎం లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎస్ఎల్‌వీఎస్‌పీ ప్రసాద్ అన్నారు. గురువారం జీఎంఆర్‌ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజాం రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ శిబిరంలో 339 యూనిట్ల రక్తం సేకరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు దాతలను అభినందించారు. రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షులు కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కేవీఎస్ ప్రసాద్, పీడీ అరుణ్ కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

వారిని మినహాయించండి

బొబ్బిలి: ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేయనున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి సడలింపు ఇవ్వాలని యూటీఎఫ్ నేత కె.విజయగౌరి కోరారు. గురువారం ఆమె ఆర్డీవో ఎ.సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, బాలింతలు, గర్భిణులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీనిపై ఆర్డీఓ సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కురమాన జోగారావు కూడా ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు.

రక్తహీనత నివారణపై దృష్టి సారించాలి




మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో సుగుణ

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి కోరారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో గురువారం గరుగుబిల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లలోపు వయస్సుగల శిశు మరణాల రేటును తగ్గించడమే లక్ష్యమని అన్నారు. దీనికోసం వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ, మహిళా సమాఖ్య, స్వయం సహాయక సంఘాలు సమిష్టిగా కృషి చేసి విజయవం తం చేయాలన్నారు. రక్తహీనత, హైరిస్క్‌గా గుర్తించిన గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో రక్తహీనత, హైరిస్క్, గర్భిణులు, బాలింతల వివరాలు, పిల్లల వివరాలు, రక్తహీనత ఉన్న కిషోర్ బాలికల వివరాలు అంగన్‌వాడీ వర్కర్ల వద్ద ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మకంగా సాగు చేపట్టాలి

పాచిపెంట: వరి పాత వంగడాల స్థానంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రయోగాత్మక సాగును రైతులు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదనరావు తెలిపారు. మండలంలోని పెదచీపురువలస, శ్యామల గౌరీపురంలో గురువారం ఆయన రైతులకు వరి వంగడాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఖరీఫ్‌లో 13:18 ఎన్‌టీయూ, 1271 వంటి రకాలను సాగు చేసుకుంటే దిగుబడి వస్తుందని తెలిపారు. భూసారం నానాటికీ క్షీణిస్తోందని, భూమిని ఇప్పటి నుంచే బాగు చేసు కోవాలని సూచించారు. భూమిలో సేంద్రియ కార్బన్ పెరగాలంటే తప్పనిసరిగా పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని పూత దశలో కలియ దున్నుకోవాలని ఆయన వివరించారు. ఈ అవగాహన సదస్సులో వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు, వ్యవసాయ సహాయకులు వినోద్‌కుమార్, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చండి సారూ..



రాయగడ రోడ్డు కొత్త అగ్రహారం వీధి ఎదురుగా భారీ గుంత

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రం లోని కొత్త అగ్రహారం వీధి ఎదురుగా ప్రధాన రహదారి మధ్యలో భారీ గుంత ఏర్పడ డంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆర్అండ్‌బీ అధికారు లు, ప్రజాప్రతినిధులకు ప్రధాన రహదారికి ఆను కొని ఉన్న నివాసితులు గుంతను పూడ్చాలని కోరారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరం. మున్సిపల్ వైస్‌చైర్మన్ కొండపల్లి రుక్మిణి నివాసం సమీపంలో ఈ భారీ గుంత ఉండడం గమనార్హం.

పోలింగ్ అధికారులే కీలకం

● కలెక్టర్ నాగలక్ష్మి
● ఎన్నికల విధులపై పీవోలు, ఏపీవోలకు శిక్షణ



రాజాం రూరల్: పీవోలకు దిశా నిర్దేశం చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం రూరల్: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారులే ఎంతో కీలకమని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. రాజాంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగు మండలాలకు సంబంధించి పీవోలు, ఏపీవోలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ట్రైనీ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా పీవోలు, ఏపీవోలకు పలు సూచనలు చేశారు. జిల్లాలో 1,847 పోలింగ్ కేంద్రాలుండగా వాటిలో 360 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 40 నుంచి 50 వరకూ సమస్యాత్మక గ్రామాలుండే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండాలి

నెల్లిమర్ల: ఎన్నికల విధుల్లో ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. గురువారం నెల్లిమర్లలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవో, ఏపీవో, సెక్టోరియల్ ఆఫీసర్ విధులపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఎలాంటి లోటుపాట్లుకు అవకాశం ఇవ్వకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని జేసీ కె.కార్తీక్ కూడా పరిశీలించి సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రమీల గాంధీ, తహసీల్దార్ ధర్మరాజు, ఎన్నికల విభాగం డీటీ మూర్తి, హెచ్‌డీటీ డి.శైలజలతో పాటు నాలుగు మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులకు తావివ్వొద్దు

గరివిడి: ఎన్నికల్లో పీవోల విధులు అత్యంత ముఖ్యమైనవని... తప్పులకు తావు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. గరివిడిలోగల డిగ్రీ కాలేజ్‌లో పీవోల శిక్షణ తరగతుల్లో ముఖ్యఅతిథిగా కలెక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి విధులపైన పీవోలకు అవగాహన ఉండాలని సూచించారు. ప్రతి చోట పోలింగ్‌కు 90 నిమిషాల ముందు తప్పనిసరిగా మాక్‌పోల్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఆర్‌ఓలు జోసెఫ్, బి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిద్దామని బొబ్బిలి ఆర్డీవో ఎ.సాయిశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాలలో గురువారం పోలింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, ఆ తరువాత అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.త్రినాథరావు నాయుడు, డీటీలు రెడ్డి సాయికృష్ణ, శ్రీనివాస్, ఆర్ఐ కల్యాణ చక్రవర్తి, ఎంఈఓ గొట్టాపు వాసు, మాస్టర్ ట్రైనీలు జేసీ రాజు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలకు తావులేకుండా పోలింగ్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ లోటుపాట్ల కు తావివ్వకుండా చూడాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. ఎంఆర్ కళాశాలలో గురువారం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పీవోలు, ఏపీవోల శిక్షణ తరగతుల్లో జేసీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వోలు నూకరాజు, మురళీకృష్ణ, విజయనగరం తహసీల్దార్ రత్నం తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఈ శిక్షణను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి మురళీ కృష్ణ, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఉప తహసీల్దార్ భరత్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా నడుచుకోండి



పీవోలకు సూచనలు చేస్తున్న ఆర్వో సూర్యకళ

గజపతినగరం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిబంధనలకు అనుగుణంగా అధికారులు నడుచుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీ సూర్యకళ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రీ పోలింగ్ వచ్చే అవకాశాలు లేకుండా ఎన్నికల బాధ్యత నిర్వర్తించాలన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్నా వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నివృత్తి చేసుకుని వెళ్లాలని, సొంత నిర్ణయాలు తగదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ రమేష్, ఎన్నికల ఉప తహసీల్దార్ సతీష్, గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ, గంట్యాడ మండలాల పీవోలు పాల్గొన్నారు.

ప్రచారానికి దూరంగా ఉండండి

చీపురుపల్లి: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని సీఎస్‌డీటీ పి.రామారావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జరిగిన రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. రేషన్ సరుకులను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి



మాట్లాడుతున్న సంధ్యారాణి

మెంటాడ: రాష్ట్రంలో ఐదేళ్ల రాక్షస పాలన నుంచి విముక్తి కోసం ప్రతిన బూనాలని సాలూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జి.సంధ్యారాణి అన్నారు. గురువారం పోరాం, కొంపంగి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల దోపిడీ పాలన, ప్రజల కష్టాలు, అరాచకాలు, అన్యాయాలు, దుర్మార్గాలను వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని అన్నారు. రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని చెప్పారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుల ఎన్నిక

గజపతినగరం: స్థానిక జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా బిత్రా సూర్యారావు ఎన్నికయ్యారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో సీనియర్ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ ఆధ్వర్యం లో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా బిత్ర సూర్యారావు, ఉపాధ్యక్షుడిగా రానాక సాయి సురేష్, కార్యదర్శిగా పొట్నూరు శ్రీను, కోశాధికారిగా లెంక రాంబాబు ఎన్నిక య్యారు. అలాగే సంయుక్త కార్యదర్శిగా జెర్రిపోతుల జగదీష్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా బిత్రా మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయనున్నట్లు తెలపారు. ● **శృంగవరపుకోట:** ఎస్.కోట న్యాయవాదుల సంఘ అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది జి.సూరిదేముడు గురువారం ఎన్నికయ్యారు. మరో న్యాయవాది ఎం.కామేశ్వరరావుపై 24 ఓట్ల ఆధిక్యంతో సూరిదేముడు గెలిపొందినట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన మామిడి చంద్రశేఖర్, బొబ్బిల రామకృష్ణ వెల్లడించారు. కార్యదర్శిగా బి.సత్యనారాయణ, ఉపా ధ్యక్షుడిగా ఎం.అప్పారావు, సంయుక్త కార్యదర్శిగా ఎల్.అప్పారావు, కోశాధి కారిగా బి.త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. మీడియా సెక్ర టరీగా డబ్ల్యూఎస్.శర్మ, లైబ్రరీ సెక్రటరీగా ఆర్.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు గా బి.రా మకృష్ణ, ఎస్.సత్యనారాయణ, చిట్టిబాబు, కోమల, ప్రవీణ్, బి.వెంకటరావు ఎన్నికయ్యారు.

కొత్తపల్లిని కలిసిన ద్వారపురెడ్డి

గరుగుబిల్లి: అరకు పార్లమెంటు బీజేపీ అభ్యర్థి, మాజీ లోక్‌సభ సభ్యురాలు కొత్తపల్లి గీతను అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ విశాఖలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి పార్టీలకు చెందినవారు తన గెలుపునకు సహకరించాలని ఆమె కోరారు.

రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారు



పార్టీలో చేరినవారితో శ్రీనివాస్

గజపతినగరం: జగన్మోహన్‌రెడ్డి అవినీతితో రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక కుమ్మరి వీధిలో యడ్ల గోపి ఆధ్వర్యంలో 80 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఆయన కండవా కప్పి ఆహ్వానించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, టీడీపీ నాయకులు మిత్తిరెడ్డి ఈశ్వరరావు, గోవింద, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీలో 50 కుటుంబాలు చేరిక

దత్తిరాజేరు: గుచ్చిమి గ్రామంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి గజపతినగరం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరినవారిలో పెద్దింటి ఆదినారాయణ, పి.నారాయణరావు, ఆర్.రామకృష్ణ, ఎం.హరికృష్ణ, పి.శ్రీనివాసరావు, పైల అప్పారావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు మల్ల సురేంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, ఎంపీటీసీ వంగపండు కృష్ణమూర్తి, సర్పంచ్ కర్రి రామకృష్ణ, పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యే అభ్యర్థి మాధవితో పాటు ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పూసపాటిరేగ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి గురువారం నుంచి తమ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో కనిమెళ్ల, కామవరం, కందివలస గ్రామాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించినట్లయితే పారిశ్రామిక అభివృద్ధికి కృషిచేసి నిరుద్యోగ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశయ సంస్థతో కలిసి ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేస్తామని చెప్పారు.

వాహనాలకు మార్గం ఉంచండి



చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు

రాజాం: చెత్తసంపద కేంద్రంలోకి చెత్తను వేయడానికి వచ్చే వాహనాలు బయటకు వెళ్లడానికి మార్గం ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆదేశించారు. గురువారం జెండాల దిబ్బ వద్ద వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఇంజనీరు భాగ్యలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి కాలనీలో పర్యటించారు.

మాజీ కౌన్సిలర్ టీడీపీలో చేరిక

బొబ్బిలి: బొబ్బిలి పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ రేవళ్ల సత్యవతి గురువారం వైసీపీని వీడి.. తెలుగుదేశం పార్టీలో చేరారు. బొబ్బిలి కోటలో బేబీనాయన, తెంటు లక్ష్మునాయు డు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కాలువలు ఎప్పుడు నిర్మిస్తారు?



సీఐటీయూ నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

పార్వతీపురం టౌన్: 'కాలువలు నిర్మిస్తామని మా ఇళ్ల వద్దగల మెట్లు తొలగించారు. ఇప్పటికి నాలుగైదు రోజులవుతోంది. కాలువల నిర్మాణంలో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడ'ని పట్టణంలోని 24వ వార్డు నాయుడు వీధికి చెందిన మహిళలు సీఐటీయూ నాయకులు వెంకటరమణ, సూరిబాబుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇళ్ల ముందు కాలువలను నిర్మించకపోతే ఊరుకోనేది లేదని గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద వారంతా నిరసన వ్యక్తం చేశారు. ఇంతలో కార్యాలయానికి వచ్చిన సీఐటీయూ నాయకులతో పాటు మహిళలు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు వద్దకు వెళ్లి తమ సమస్యను తెలియజేశారు. కమిషనర్ స్పందిస్తూ వెంటనే కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజల కు ఈ వేసవిలో సంపూర్ణంగా తాగునీ టిని సరఫరా చేసేం దుకు చర్యలు చేపడు తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస రావు తెలిపారు. గురువారం తోటపల్లి నాగావళి నదిలో గల ఇన్‌ఫిల్టర్ బావుల్లో మోటార్ల సామర్థ్యాన్ని పరిశీలించారు. నది నీటిని ఇన్‌ఫిల్టర్ బావుల్లోకి మళ్లించడంపై ప్రత్యేక శ్రద్ధ చూ పాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రధాన, బూస్టర్ పంప్‌హౌస్‌లలో మోటార్ల పనితీరును స్వయంగా పరిశీలించారు. వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా తక్షణమే చర్యలు చేపట్టేలా ప్రణా ళిక లు సిద్ధం చేసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి

సాలూరు: ప్రత్యేక అవసరాలగల బాలబాలికలు ఉచిత ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల విద్యా శాఖ అధికారి రాజ్‌కు మార్ కోరారు. స్థానిక రామాకాలనీలో ఉన్న భవిత కేంద్రం వద్ద గురువారం ప్రత్యే క అవసరాలగల పిల్లలకు మెడికల్ అసెస్మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన 80 మంది దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు హాజరయ్యారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త పి.భానుమూర్తి, వైద్యులు పాల్గొన్నారు.